క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్ర ప్రదేశ్ ఖజానా, లెక్కల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఆ శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గురువారం స్థానిక జిల్లా ఖజానా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాఖాపరంగా ఉద్యోగులకు అవసరమైన అన్ని అంశాలతో కూడిన డైరీ రూపొందించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జె.ప్రభుదాస్, సెక్రటరీ ఉదయకాంత్, ట్రెజరర్ హరిహర పుత్రతోపాటు ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును కడపలోనే కొనసాగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి కోరారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రైతులకు, మధ్యతరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, కరవు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి, ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. అందువల్ల ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరారు.

నేటి నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అంతర్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి నేతృత్వంలో యూనివర్శిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్ బ్యాడ్మింటన్ (బాలురు), హ్యాండ్ బాల్ (బాలురు, బాలికలు), సాఫ్ట్ బాల్ (బాలురు, బాలికలు) పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

శబ్ద కాలుష్యం చేయవద్దు

కడప అర్బన్ : కడప నగరంలోని కొందరు యువకులు, వారి తల్లిదండ్రులకు కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు గురువారం కడప రిమ్స్ పీఎస్‌లో కౌన్సిలింగ్ చేశారు. శబ్ద కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్‌లను వాడుతున్న, బైక్ రేస్‌లకు పాల్పడుతున్న వారిని బైపాస్ రోడ్డులో రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారిని, వారి తల్లిదండ్రులను పిలిపించి డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫీసర్ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు వైఎస్ఆర్ జిల్లా సి.కే.దిన్నె, మాధవరంలో గల బాలాజీ ఫ్యామిలీ రెస్టారెంట్, ఒంటిమిట్ట కాఫీ షాపులో, అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయినపల్లిలో కడప, రాజంపేట విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. 24 గృహ అవసర సిలిండర్లను జప్తు చేసి స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. వ్యాపార సంస్థల యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్సు అధికారులు గీతావాణి, పి.సౌజన్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవుని కడప చెరువులో పడి వృద్ధుడి మృతి

కడప అర్బన్ : దేవుని కడప చెరువులో గురువారం ప్రమాదవశాత్తు పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అతన్ని వెలికి తీసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. చిన్న చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగో రోజుకు చేరిన నిరసన



కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్: స్టైఫండ్ పెంచాలని మండలంలోని గోపవరం సమీపంలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరసన గురువారం నాలుగో రోజుకు చేరింది. గురువారం కళాశాల ఆవరణలో టెంట్ వేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. క్లాసులకు గైర్హాజరై తాము ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు పేర్కొన్నారు.

లోకానికి ప్రభువును అందించిన తల్లి లూర్దుమాత



దైవ సందేశాన్ని అందజేస్తున్న కడప పాస్టరల్ సెంటర్ రెవరెండ్ ఫాదర్ ముండ్లపాటి వరప్రసాద్



విద్యుద్దీప వెలుగుల్లో చర్చి ఆవరణ

కడప కల్చరల్ : లూర్దుమాత మానవ లోకానికి పవిత్రమైన ప్రభువును అందించి, ఈ లోకం పట్ల తనకుగల ప్రేమ, వాత్సల్యాన్ని చాటుకున్నారని కడప పాస్టరల్ సెంటర్ రెవరెండ్ ఫాదర్ ముండ్లపాటి వరప్రసాద్ అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా ఐదవరోజు గురువారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ ముండ్లపాటి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజల పాప క్షమ కోసమే ప్రభువైన ఏసుక్రీస్తు మానవుడిగా జన్మించారని, ప్రజలందరికీ క్షమ గుణాన్ని దయను, సాటి వారిని ప్రేమించే గుణాన్ని అలవాటు చేసేందుకు కృషి చేశారన్నారు. మాసాపేట విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ తొగురు సుప్రియన్ దివ్య బలిపూజ నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మాసాపేట బృందం సభ్యులు పీఠాన్ని అలంకరించి స్తుతి గీతాలను ఆలపించారు. కార్యక్రమాలను తిరునాల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఈదుర్‌బాష

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి సత్ప్రవర్తనతో మెలగాలని కడప మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఈదుర్‌బాష తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం, వన్ స్టాప్ సెంటర్‌తో కలిసి విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు పేదలు కష్టపడి పనులు చేసుకుంటూ వారి పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చదివిస్తూ ఉంటారన్నారు. కొందరు పిల్లలు తల్లిదండ్రుల కష్టాలను గుర్తించకుండా చదువు పట్ల నిర్లక్ష్యంగా అశ్రద్ధ వహిస్తూ చెడు స్నేహాలు, అలవాట్లకు గురవుతూ ఉజ్వల భవిష్యత్తును వారంతట వారే కోల్పోయేలా ప్రవర్తిస్తుంటారన్నారు. ఇలాంటి వారు వారి జీవితాల్లో కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎస్ఐ శాంత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కౌమర దశలో ఉన్న పిల్లలు తెలిసో తెలియకో సోషల్ మీడియాకు ఆకర్షితులవుతూ తద్వారా ముక్కు, ముఖం తెలియని వారికి తమ సమాచారాన్ని తెలియజేస్తూ వారి జీవితాలను అనామకుల చేతిలో బలి చేసుకుంటున్నారన్నారు. జాగ్రత్తగా నడుచుకోవడంతోపాటు మంచి, చెడు పట్ల అవగాహనతో మెలగాలని, సరైన మార్గంలో నడిచినప్పుడే సంతోషంగా గడప వచ్చన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్లు మహేష్, సునీత మాట్లాడారు. పిల్లలు తమ సమస్యలను చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాడ్, గుడ్ టచ్‌పై అవగాహన

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిని ఖచ్చితంగా బ్యాడ్, గుడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని కడప మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష పేర్కొన్నారు. గురువారం కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్, సైబర్ క్రైమ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చైల్డ్ బెగ్గియింగ్, చైల్డ్ లేబర్ విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శాంతి, ఎస్ఐ శ్రీనివాసులు, కౌన్సిలర్ సైకాలజిస్టు సునిత, ఎంఈఓ గంగిరెడ్డి, గాంధీనగర్ హైస్కూల్ హెచ్ఎం ఆశ్రీఫ్యాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ గ్రహీతకు అభినందన



గోల్డ్ మెడల్ గ్రహీత నజిమున్నీసాను ప్రశంసిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ ఉర్దూశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డా.నజిమున్నీసా నాజ్‌ను ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి, శాఖాధిపతి ఆచార్య కె. రియాజున్నీసా అభినందించారు. డా.నజి మున్నీసా నాజ్ ఢిల్లీ ఉర్దూ వరల్డ్ లిటరరీ ఫోరం బెజ్మ్ సుర్కిల్ ఆదాబ్ ఇంటర్నేషనల్ సయ్యద్ అబ్దుల్ హమీద్ గోల్డ్ మెడల్‌ను ఇటీవల అందుకున్నారు. ఈమె రచించిన రెండు పుస్తకాలు, వ్యాసాలు ఆ సంస్థ స్టడీ చేసి ఈమెకు బంగారు పతకం అందజేశారు. రచయితగా, కవిగా ఉర్దూ సాహిత్యంలో రాణిస్తున్నందుకు అధికారులు ప్రశంసించారు.

వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా చంద్ర

యోగివేమన యూనివర్సిటీ అఫైర్స్ డీన్‌గా విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఆచార్యులు పి.చంద్ర ఓబుల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం వీసీ చాంబర్‌లో ఆచార్య చంద్ర ఓబుల్‌రెడ్డికి ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి ఇన్‌చార్జ్ కులసచివులు, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందజేశారు.

జాతీయ విద్యా విధానం భవిష్యత్ తరానికి మార్గదర్శకం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

కడప ఎడ్యుకేషన్ / కడప కల్చరల్ : జాతీయ విద్యా విధానం భవిష్యత్ తరానికి మార్గదర్శకం అని ఢిల్లీకి చెందిన నేషనల్ జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ లక్ష్మణ్ పేర్కొన్నారు. డా.వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జాతీయ విద్యావిధానం, భారత జాతి వారసత్వం, సాహిత్య పునరుద్ధరణ అనే అంశాలపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ భవిష్యత్ భారతావనికి జాతీయ విద్యా విధానం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం విద్యార్థులకు శుభపరిణామమని అన్నారు. భారతీయ సంస్కృతి మహోన్నతమైనదని, అది అంతరిస్తే మానవజాతికి మనుగడ లేదని అన్నారు.

తెలుగు అధ్యాపకులు ఆచార్య ఈశ్వరరెడ్డి మాతృ భాషలో విద్యాబోధన ఆవశ్యతను తెలియ జేశారు. సాహితీ వేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మహా కవయిత్రి మొల్ల సాహిత్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య వై.వి. రామిరెడ్డి, అనంతపురం జేఎన్‌టీయూ అధ్యాపకులు ఆచార్య శశిధర్ కుమార్, సదస్సు సహాయ నిర్వాహకులు డాక్టర్ జి. ఫణీంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైబ్రరీ సేవలను మెరుగు పరిచేందుకు కృషి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : లైబ్రరీ సేవలను మెరుగు పరచడానికి సమిష్టిగా కృషి చేద్దామని లైబ్రరీ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వైవీయూలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీలో లైబ్రరీ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి లైబ్రరీ అడ్వైజరీ కమిటీ సభ్యులు (ఎల్ఏసీ) ప్రొఫెసర్ ఎ.జి.దాము, సైన్సు ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ కె.గంగయ్య, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ పి.రమాదేవి, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీఎన్ డాక్టర్ బి.ప్రసాదరావు, లైబ్రరీ అసిస్టెంట్ గ్రేడ్-1 ఆర్. విజయ్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్. రఘునాథ రెడ్డి పాఠ్యపుస్తకాల కొనుగోలు, జర్నల్స్, ఇ-జర్నల్స్ సేకరణ, వివిధ డిజిటల్ లైబ్రరీ సాఫ్ట్‌వేర్‌లకు సభ్యత్వం పొందే విషయాలపై చర్చించారు. దీంతోపాటు లైబ్రరీ వనరులు, సేవలను మెరుగు పరచడంపై కూడా చర్చించారు. పబ్లిక్ రిలేషన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత పలు విషయాలపై చర్చించారు.

11 నుంచి శ్రీ విజయదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10న సాయంత్రం 6 గంటలకు అంకురారోపణ, బ్రహ్మోత్సవ పూర్వంగ కార్యక్రమం నిర్వహించనున్నారు. 11న ఉదయం 4.30 గంటలకు దీక్షా స్నపనం, 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, వాస్తు పూజ, హోమం నిర్వహించనున్నామని తెలిపారు. 9.30 గంటలకు ధ్వజపటం పూజ, ధ్వజారోహణం, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, నవావరణ శ్రీ చక్రార్చన ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రాహుకాల పూజ, రాత్రి 8 గంటలకు సింహవాహనంపై అమ్మ వారి ఆలయ ప్రదక్షిణ నిర్వహిస్తామన్నారు. 12న తెల్లవారుజామున 4.30 గంటలకు నవకలశ స్నపనం, ఉదయం 9 గంటలకు చండీహోమం, శ్రీ చక్రార్చన, రాత్రి 8 గంటలకు వృషభ వాహనంపై అమ్మవారి ఆలయ ప్రదక్షిణ ఉంటాయన్నారు. 14న ఉదయం 4 గంటలకు కలశాభిషేకం, 10.30 నుంచి సుమంగళి పూజ, సాయంత్రం 3.30 నుంచి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవం, రాత్రి 8.30 గంటలకు నగరోత్సవం ఉంటాయన్నారు. 15న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తామని, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజాఅవరోహణం, త్రిశూల స్నానం, రాత్రి 8.30 గంటలకు పుష్పయాగం ఉంటుందన్నారు.

• పగలు, రేయి ఇంతే..!



ఆర్కే నగర్ మెయిన్‌రోడ్డులో పగలే వెలుగుతున్న వీధి దీపం



ఆర్కేనగర్‌లోని ఓ వీధిలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని ఆర్కే నగర్‌లోని దాదాపు అన్ని వీధుల్లో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఇలా ఏకధాటిగా వెలుగుతుండడంతో కొన్ని రోజులకే వీధి దీపాలు కాలిపోయి అంధకారం నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంగా కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ విషయంగా అధికారులు స్పందించి పగటి పూట దీపాలు ఆర్పేలా చూడాలని తెలియజేస్తున్నారు.




హంస వాహనంపై దర్శనమిస్తున్న కడప రాయుడు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హంస వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్ : దేవుని కడపలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం చక్రస్నానం చేపట్టారు. రాత్రి కడపరాయుడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కాగా చక్రస్నానం సందర్భంగా విశేష పూజలు చేశారు. కోనేరులో స్వామి వారి చక్రస్నానం అనంతరం భక్తులు కూడా కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు.



అభిషేకానికి సిద్ధమైన దేవతామూర్తులు



ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు



పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు

నేడు విగ్రహ ప్రతిష్ట



యాగశాలలో కలశ స్థాపన పూజలు నిర్వహించిన వేద పండితులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించి ఆలయం ఆవరణంలో కామాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సింహవాహన, జీవధ్వజ, శిఖర కలశము, శ్రీ చక్ర సహిత విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. భక్తులు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనాలని వారు కోరారు.

రామాలయ పనుల్లో కూలీకి పాముకాటు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం జీర్ణోద్ధరణ పనులు చేస్తున్న కూలీని గురువారం పాము కాటేసింది. రామాలయంలోని గర్భాలయంలో జీర్ణోద్ధరణ పనులు చేస్తున్న మఠం నరేష్ అనే యువకుడిని పాము కాటు వేసింది. సకాలంలో వైద్యం చేయించుకోవడం వలన ప్రాణాపాయం తప్పింది.

ఆకట్టుకున్న సంకీర్తనా గానం



భక్తిగీతాలను ఆలపిస్తున్న టీటీడీ కళాకారులు

కడప కల్చరల్ : గోవింద గోవింద యనిపలుకరే అంటూ గాయకులు తమ కళా ప్రతినిధిని చాటుకుంటూ శ్రీనివాసుడిని కీర్తించారు. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం తిరుమల-తిరుపతి దేవస్థానాల గాయకబృందం ఆలయంలోని ప్రత్యేక వేదికపై శ్రీనివాస గానామృతం పేరిట భక్తి గానకచేరీ చేశారు. వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమంలో తొలిరోజు గానకచేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమాచార్యుల ప్రముఖ కీర్తనలతోపాటు మరికొందరు కవులు రాసిన భక్తికీర్తనలు కూడా వారు ఆలపించారు. భక్తులు వారితో కలిసి తన్మయులై గానం చేశారు. ఆలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవాలలో భాగంగా రెండవరోజు శుక్రవారం యువతులు, మహిళలు శ్రీనివాసునికి నృత్య నీరాజనం పేరిట నృత్య ప్రదర్శనలివ్వనున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం శ్రీ శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు.

యాదవ భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న నారాయణ యాదవ్

కడప రూరల్ : యాదవ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పరిపాలనలో కడప రిమ్స్ పరిధిలో యాదవ భవన్ నిర్మాణానికి 83 సెంట్లు కేటాయించారని తెలిపారు. ఈ భవనం నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే యాదవ వర్గీయులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. యాదవ కార్పొరేషన్ అలంకారప్రాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో పాములేటి యాదవ్, ఎల్లయ్య యాదవ్, గోపాల్ యాదవ్, శేఖర్ యాదవ్, రామ్మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్‌లో రిచర్డ్స్ సన్‌కు పట్టా



రిచర్డ్స్‌సన్

కడప రూరల్ : కడప నగరం అశోక్ నగర్ కు చెందిన కె. రిచర్డ్స్ సన్ మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్ లో పట్టా పొందారు. ఈయన బెంగళూరులో ఢిల్లీ రాజీవ్ గాంధీ యూనివర్సిటీకి అనుసంధానంగా ఉన్న లిటిల్ ఫ్లవర్ గ్రూప్ ఆఫ్ ఇన్ ఇనిస్టిట్యూషన్ లో మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్ లో పట్టా పొందారు. ఈ సంస్థలో విద్యను పొందుతున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల్లో ఇతను ప్రథమ స్థానంలో నిలిచారు. ఈయన బిషప్ డాక్టర్ కె సామ్యూల్ బాబు, హెప్సిబా దంపతుల కుమారుడు. ఈ సందర్భంగా పట్టా పొందిన రిచర్డ్స్ సన్ ను పలువురు అభినందించారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సింజెంటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు గ్రామీణ యువతీ యువకులకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషనల్, సింజెంటా ఫౌండేషన్ ఇండియా ప్రతినిధులు ఎన్.సుబ్బరామిరెడ్డి, సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ సమయంలో నూతన వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ వ్యాపారాలు, వ్యవసాయ లోన్లు, వ్యక్తిత్వ వికాసం, వ్యవసాయ సాంకేతికత, ప్రకృతి ఆధారిత వ్యవసాయం, టెక్నాలజీపై నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఈ శిక్షణకు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు 90630 82227, 96665 82622 సంప్రదించాలని కోరారు.